

# అరాచకీయం

కె.కె.మీనన్

ఆర్రోజులపాటు నిరవధికంగా సాగిన కర్ఫ్యూ ఆ రోజు రెండు గంటలసేపు విద్దకించింది.

ఆర్రోజుల తర్వాత తలుపుతీసి బైటికి చూసేడు హకీంసాబ్.

వేకువ తెలతెల్లగా వుంది. వీధిలో ప్రశాంతంగా వుంది. ఊరంతా మౌనంగా వుంది.

లోపికెళ్ళి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని బైటికి వచ్చేడు హకీంసాబ్.

ఉదయం నులివెచ్చగా వుంది. ఆకాశం నిర్మలంగా వుంది. గాలి మందమందంగా వుంది.

వెనక్కి తిరిగి మళ్ళీ ఇంట్లోకెళ్ళేడు హకీంసాబ్.

ఇల్లింకా చీకటి చీకటిగావుంది. భార్య ముఖం వెలవెలాగావుంది. మంచం మీద కూతురు శవంలా వుంది. దాని ఒళ్ళు పెళపెళాగా వుంది.

ఇద్దరి ముఖాల్లోకి కాస్సేపు చూసేడు.

మరుక్షణం మూలనున్న చేతికర్ర అతని చేతిలో వుంది.

"ఎక్కడికి?" అడిగింది భార్య.

అలా ఇంతకు ముందెప్పుడూ అడగలేదామె.

అలా అడిగే ధైర్యం లేదామెకు.

మగవాళ్ళి ఆడది అలా అడగటం వాళ్ళకి కుసాంప్రదాయం.

అయినా అడగక తప్పలేదు. అవి అడగక తప్పని పరిస్థితులు.

నగరం నిప్పుల కుంపటిలా మండిపోతోంది. రాక్షసులు ఆక్రమించిన రాజ్యంలా అల్లకల్లోలంగా వుంది.

ఎవరు, ఎవర్ని, ఎందుకో_తెలీకుండా చంపుకుంటున్నారు.

మరి అడగక తప్పలేదు ఆ యిల్లాలికి.

చెప్పక తప్పలేదు ఆ పురుషోత్తముడికి.

మరో అప్పుడైతే చెప్పేవాడు కాదు హకీంసాబ్.

చెప్పకూడదని అతని అభిప్రాయం కాదు.

పురుషాధిక్యతను సంతరించుకున్న సంస్కారం అతనిది.

అంచేత, ఆడది అడిగినా చెప్పనక్కర్లేదని అతని అభిప్రాయం.

అయినా చెప్పేడు.

"అలా ఉస్మానియా దావఖానదాక వెళ్ళొస్తాను. బాలయ్యన్న ఎలాగున్నాడో ఏమో!"

బాలయ్య హకీంసాబ్‌కి బహిఃప్రాణం. ఒకే బస్తీలో పుట్టి పెరిగినవాళ్ళు. ఒకే తల్లి బిడ్డలుగా మెలిగినవాళ్ళు.

బాలయ్య కత్తిపోటుతోనే ప్రారంభమైంది కర్ఫ్యూ.

ఆ పొడిచింది ఎవరో బాలయ్యకు తెలీదు.

బాలయ్య హిందువుడు కాబట్టి ముస్లిం పొడిచి వుంటాడని పోలీసుల కథనం.

కాబట్టి, అది మతకలహాల కల్లోలం అని రాజకీయుల రంకెలు.

బాలయ్యను పొడిచింది ఎవరైనా, అతన్ని హాస్పిటల్లో చేర్పించింది మాత్రం మహమ్మదీయుడే.

బాలయ్య ఇప్పుడు ఉస్మానియా హాస్పిటల్లో కోలుకుంటున్నాడు.

"ఇప్పుడు వెళ్ళకపోతేనే...." భార్య రెండో ప్రశ్న.

అతను వెళ్ళకూడదని ఆమె అభిప్రాయం కాదు.

ఆ పరిస్థితుల్లో వెళ్ళకపోతేనేం అని ఆమె ఆందోళన.

అసలే, ఆయన గెడ్డమూ, షేర్వాణీ, నెత్తిమీద కుచ్చుల టోపీ _ అవిహా

వడాల్సిన అవసరానికి చాల దూరంగా వుంది.

ఆ ఆందోళనని వ్యక్తంచేయకుండా-

“అమ్మాయికి నూటైదు జ్వరం” అంది.

“అది నాకు తెలీదా? మందిస్తూనే వున్నాంగా. ఇప్పుడు వుండిమాత్రం చేసే దేముంది? అవతల కోటి సోదరుడు చావు బతుకుల్లో వున్నాడు. అసలు వచ్చిపోయే దేమో కూడాను.

అతని మాటలు తీవ్రంగా వున్నాయి.

గొంతు భారంగా వుంది.

ఇక అతన్ని ఆపటం సాధ్యం కాదు. అదామె అనుభవం.

వెనక్కి తిరిగి కూతురు దగ్గరికెళ్ళి పోయింది.

హకీంసాబ్ వెనక్కి వచ్చి ఏదో మందు పొట్లాలు నాలుగైదు కాగితంలో చుట్టుకుని, జేబులో పెట్టుకున్నాడు.

హకీంసాబ్ పేరు అసదుల్లా ఖాన్.

అతను నగరంలో మంచి పేరున్న యునానీ వైద్యుడు.

అతని పేరు మరుగునపడి, హకీం స్థిరపడిపోయింది.

హకీం సాబ్ ఇంట్లోంచి బైటపడ్డాడు.

వీధులు విశాలంగా వున్నాయి. ఇంతకు ముందు ఇరుగ్గా అన్పించే ఆ వీధులు బహు విశాలంగా, భయం భయంగా వున్నాయి.

జనం పల్చగా తిరుగుతున్నారు. వాళ్ల ముఖాల్లో ఆందోళన అతృత ముసురుకుని వున్నాయి.

వీధుల్లో అక్కడక్కడా నిత్యావసర వస్తువుల అంగళ్లు తెరుచుకున్నాయి. వాటి ధరలు మన జనాభాలా ఆకాశంలో వున్నాయి. అయినా అందుబాటుకు దూరంగా వున్నాయి.

హకీంసాబ్ ఆందోళన అడుగులుగా రోడ్డుమీద వేగం పుంజుకుంటోంది.

రిక్షాగాని, ఆటోగాని దొరికితే వేగిరం పోయి రావచ్చనుకున్నాడు.

పోలీసులమీద విసిరిన రాళ్లూ రప్పలూ తప్ప రోడ్డుమీద వాహనాలేవీ లేవు.

కర్ర ఊపుకుంటూ తనకు అసహజమైన వేగంతో హాస్పిటలువైపు నడిచేడు హకీంసాబ్.

తన హాస్పిటలు చేరుకునేందుకు శాంతి భద్రతలు సహకరించేయి.

నడవటానికి శరీరం సాయంచేసింది.

లోపలి కెళ్ళటానికి మాత్రం అక్కడి కింకరుడు అంగీకరించలేదు.

“ఇది లోపలికెళ్ళే సమయమే కదా?” అన్నాడు హకీంసాబ్.

“అది మామూలప్పుడు. ఇప్పుడుకాదు” కింకరుడి సమాధానం.

బరువు పెట్టక తప్పింది కాదు.

ఎంత ఒద్దనుకున్నా కొన్నిచోట్ల, కొన్ని సమయాల్లో, కొన్ని చేయకూడని పనులుకూడా చేయాలి కదా, అనుకున్నాడు హకీం.

అనుకుంటూనే బాలయ్యదగ్గరకు చేరు కున్నాడు.

హకీంసాబ్ ఆందోళన పడినంత ప్రమాదస్థితిలో లేడు బాలయ్య.

ప్రమాద స్థితిలో వున్న ఒక ముస్లిం యువకుడికి పరిచర్యలు చేస్తూ పరుగెత్తు కొచ్చింది భార్య.

"నమస్తే హకీం భయ్యా".

"నమస్తే, నమస్తే .... ఎక్కడున్నది?"

"అదుగో విన్న ఏ దుండగుడో ఆ బాబుని పొడిచాడు. కత్తి ఊపిరితిత్తుల్దాకా దిగిపోయింది. పాపం రిక్షా తొక్కుకుని బతుకుతున్నాడంట. అతనిప్పుడు అటో ఇటో అయితే ఆ యిల్లు వల్ల కాదే"

"అవును మరి!!"

"ఎందుకన్నా, మనుషులిలా రాక్షసులై పోతున్నారు?"

"ఏం చెప్పమంటావమ్మా...." అని నిట్టూర్చేడు.

ఆమె ప్రశ్నకు అతని దగ్గర జవాబు లేక కాదు.

చెప్పటం ఇష్టం లేక.

పక్క మంచంమీది యువకుడు మూలిగేడు. ఆమె అటువైపు పరుగెత్తి పోయింది.

"ఊళ్ళో గలాటా జరుగుతుంటే ఎందు కొచ్చావు హకీంభయ్యా" అనడిగేడు బాలయ్య.

కొన్ని ప్రశ్నలకు సమాధానం వుండదు. ఆ ప్రశ్నలూ అర్థహీనంగానే వుంటాయి.

ఒక చిరునవ్వే సమాధానంగా సరి పెట్టేడు హకీంసాబ్.

"వెళ్లు, వెళ్లు.... మళ్ళీ పోలీసులు గలిబిలి చేస్తారు" అని తొందరపెట్టేడు.

హకీంసాబ్‌కి అంత తొందరగా వెళ్ళాలని లేదు. కాని వెళ్ళక తప్పదు.

"చూడు బాలయ్యన్నా, ఈ యింగ్లీషు మందులకి గాయం తగ్గదు. ఈ మందులు కూడా వేసుకో...."

జేబులోంచి కాగితంపొట్లం తీసి బాలయ్యచేతిలో పెట్టేడు.

• • •

ఇక అరగంటలో మళ్ళీ కర్ఫ్యూ రాజ్యం రాబోతోంది. దాన్ని అధిగమించ టానికి అంగలు ఫర్లాంగులుగా వేసు కుంటూ నడుస్తున్నాడు హకీంసాబ్.

రోడ్లు పూర్తిగా నిర్మానుష్యం అయి పోయేయి.

పోలీసు బలగం పెరిగింది.

వీధిలోంచి సన్న సందులోకి తిరిగేడు హకీంసాబ్.

ఇద్దరు ముగ్గురు యువకులు ఎదురుగా పరుగెత్తుకొచ్చేరు.

అందులో శంకర్‌లాల్ కూడా వున్నాడు.

"హకీందాదా.... అటెళ్ళకు. ఇలా రా ఈ గల్లీలోంచి పంపిస్తాము" అన్నాడు శంకర్‌లాల్.




ఏదో జరగకూడని. వనే అక్కడ జరిగివుంటుందని అనుమానపడ్డాడు హాకీంసాబ్.

"ఇంకెంత? ఇల్లు దగ్గరదిపండి కదా" అని అలే వెళ్ళబోయేడు హాకీంసాబ్.

"ఒద్దు దాదా, అటెళ్ళొద్దు" అని హాకీంసాబ్ జబ్బపట్టుకుని లాగుతోన్న సమయంలోనే పోలీసు విజిల్స్ విన్పించేయి.

శంకర్లాల్ హాకీంసాబ్‌ను ఒదిలేసి సందులోకి అదృశ్యమైపోయాడు.

ముందుకు సాగేడు హాకీంసాబ్.

అతని అనుమానమే నిజమైంది. ఆ సందులో కొన్ని గజాల అవతలే ఒక యువకుడు రక్తం మడుగులో పడి వున్నాడు.

"అరె అల్లా......" మోకాళ్ళమీద కూర్చొని ఆ యువకుడి చేయి తీసుకుంటున్నాడు నాడి పరీక్షించేందుకు.

నలుదిక్కుల్నుంచీ ఇనుపడెక్కల చప్పుడు వినిపించింది.

శంకర్లాల్ ఒదిలేసిన హాకీంసాబ్ జబ్బను పోలీసులు పట్టుకున్నారు.

పోలీసు వేనూ, అంబులెన్సూ.... ఒకదాని వెంబడి ఒకటి వచ్చేయి.

* * *

పోలీసు స్టేషన్లో పన్నెండు గంటలు కొట్టేరు.

హాకీంసాబ్ శ్రద్ధగా పన్నెండు గంటలూ లెక్క పెట్టేడు.

పోలీస్టేషను రైల్వే ప్లాట్‌ఫారంలా వుంది. ఒచ్చేవాళ్ళు పోయేవాళ్ళూ....

ఒచ్చేవాళ్ళు వస్తూనే వున్నారు.

మళ్ళీ వేన్లో వేసుకుని ఎక్కడికో పట్టుకుపోతూనే వున్నారు.

హాకీంసాబ్ మాత్రం ఉదయంనించీ అలా వెనకగదిలోనే పడివున్నాడు.

నిద్రపోవల్సిన సమయం — హాకీంసాబ్‌కు నిద్ర రావటంలేదు.

ఆకలి కావల్సిన సమయం — హాకీంసాబ్‌కు అసలు ఆకలే లేదు.

ఇంట్లో ఏమీలేవు–భార్య ఏం తిన్నదో ఏమో!

కూతురికి మందివ్వాల్సిన సమయం– జ్వరం ఎలా వుందో ఏమో!!

హకీంసాబ్‌కు నిద్ర రావటంలేదు.

అయినా బల్లమీద పడుకునే వున్నాడు.

ఎవరో తలుపు తోసుకు లోపలి కొచ్చేరు.

నలుగురు మనుషులు.... వెనక లావు పాటి మనిషి...

"అరె! ఇంతటితో అయిపోయిందను కుంటున్నాడా ఏమి? ఎంతకాలం జైల్లో పెడ్తాడో చూస్తాం...." అంటున్నాడు అందులో ఒకడు. చాలసేపట్నుంచీ వాళ్ల మధ్య సంభాషణ సాగుతోందని అర్థమైంది హకీంసాబ్‌కు.

కళ్ళుమూసుకుని నిద్ర నటించేడు.

"ఎందుకంత ఇదయిపోతావు? ఇది జైలు కాదు. పోలీస్టేషను" అంటున్నాడు లావుపాటి మనిషి.

"ఇంక తర్వాత జైలేగా" మరొకడు.

"అన్నీ సర్దుబాటు చేస్తాగా. కంగారు పడకండి."

"సర్లే. చేశావు. గొప్ప బేరం తీసు కొచ్చావుగా. సొమ్ము ఇవ్వకపోగా పోలీ సుకి అప్పచెప్తాడా?"

"ఆయన ఇవ్వనని అన్లేదుగా. మీరే కంగారుపడ్డారు."

"ఏవిటి ఆయన ఇచ్చేది? ముష్టి ముప్ఫయి వేలా? మనిషికి అయిదు వేలని కదా మావు చెప్పింది."

"వస్తే మాట...."

"ఇప్పటికే పదిమంది చచ్చారు."

"అందర్నీ మీరే చంపారని గ్యారంటీ ఏముంది?"

"అంటే .... నిజంగానే హిందూ ముస్లింలు కొట్టుకుచస్తున్నారని మిమ్మల్ని కూడా నమ్మిస్తున్నారా?"

"లేదు.... లేదు...."

"మరేవిటి?"

"ఏమీ లేదు.... అంతా అనుకున్నట్టు జరగలేదు."

"ఏం జరిగితే మా కెందుకండీ వాళ్ళకి పదవులెంతో మాకు పైసలూ అంతే...."

కథ అర్థమవుతూ వుంది హకీం సాబ్‌కు.

"అయినా మీరు చేసినపని మాత్రం బాగుందా?" అన్నాడు లావుపాటి మనిషి.

"ఏం చేశాం?"

"ముస్లిం ఏరియాలో హిందువుల్నీ, హిందువుల ఏరియాలో ముస్లింలనీ చంప మన్నాం. మీరేమో విచక్షణ లేకుండా ఎక్కడ ఎవడు కనబడితే వాణ్ణిలా బాదిచేశారు."

"అవును మరి. మాకేం తెల్సు. మేం ఇక్కడివాళ్ళమా?"

—అరె అల్లా, చెవులు మూసు కున్నాడు హకీంసాబ్.

ఇక ఏమీ వినలేకపోయాడు.

లోపల, బైట– అంతా చీకటి.

మనసునిండా మరింత కారుచీకటి.

□